క్లుప్తంగా

ఘనంగా మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండుగ



పూజలందుకుంటున్న మరిడి మహాలక్ష్మి

జామి: మండల కేంద్రంలోని గొర్లెవీధిలో కొలువై ఉన్న మరిడి మహలక్ష్మి అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పసుపు, కుంకుమ, చీర, జాకెట్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భోజనం రుచిగా ఉండాలి..



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

గుర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందించే పౌష్టికాహారం రుచికరంగా ఉండాలని ఎంఈఓలు ఎస్.భానుప్రకాష్, ఎం. శ్రీనివాసరావు ఎండీఎం నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని కొర్లానపేట ప్రాథమిక పాఠశాలను మంగళవారం వారు తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఆర్టీసీ డిపో సందర్శన



ఎస్.కోట ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటుతున్న ఈడీ రవికుమార్

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపోను విజయనగరం జోన్–1 ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ మంగళవారం సందర్శించారు. స్థానిక ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆయన్ని సన్మానించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే కొత్తవలస బస్‌స్టేషన్‌ను సందర్శించారు. అక్కడ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన రెస్ట్‌రూమ్‌ను ప్రారంభించారు. ఆయన వెంట డిపోమేనేజర్ కె.రమేష్, ఆర్టీసీ ఉన్నతాధికారులు సీహెచ్.అప్పలనారాయణ, అప్పలనాయుడు, కె.శ్రీనివాస్, వేణు, కృష్ణారావు తదితరులు ఉన్నారు.

గేదెలవానిపాలెంలో ప్రత్యేక పశువైద్యశిబిరం



రైతుకు మందులు అందదజేస్తున్న ఏడీఏ గంగాధర్, తదితరులు

లక్కవరపుకోట: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా మండలంలోని గేదెలవానిపాలెం గ్రామంలో పశుసంవర్థక శాఖాధికారులు మంగళవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. పశుసంవర్థక శాఖ కొత్తవలస సబ్‌డివిజన్ సహాయ సంచాలకుడు గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఎల్.కోట, భీమాళి పశు వైద్యాధికారులు గాయత్రి, ఎస్.సత్యనాయరాయణ, తదితరులు 72 పశువులకు గర్భకోశ చికిత్సలు, 12 పశువులకు సాధారణ చికిత్స అందించారు. కార్యక్రమంలో చొప్ప దేముడు, తదితరులు పాల్గొన్నారు.

కుమరాం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న నిర్వాహకులు

జామి: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో విజయనగరంలోని ప్రభుత్వ సాంస్కృత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో కుమరాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు విద్యార్థులు ఏ. చైత్రాలి, ఆర్.శరణ్యలను హెచ్‌ఎం చిట్టి పద్మావతి, ఉపాధ్యాయుడు గుండాల శ్రీనివాసరావు మంగళవారం అభినందించారు. విద్యార్థులు సెప్టెంబర్‌లో రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు హాజరవుతారని హెచ్‌ఎం తెలిపారు.

23న కర్లాంలో నేత్రవైద్య శిబిరం

చీపురుపల్లి: మండలంలోని కర్లాం గ్రామంలో మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని రామమందిరం వద్ద ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్నశిబిరంలో విజయనగరానికి చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది నేత్ర పరీక్షలు చేస్తారని చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



గజపతినగరం రూరల్: మర్రివలసలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాది శ్రీనివాస్



గుర్ల: కెల్లలో యువత, గ్రామస్తులకు అవగాన కల్పిస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

గజపతినగరం రూరల్: ప్రతీ ఒక్కరికిచట్టాలపై కనీస అవగాహన ఉండాలని, అప్పుడే నేరాలను నియంత్రించే అవకాశం ఉంటుందని మండల న్యాయవాదుల సంఘం కార్యదర్శి పొట్నూరు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మర్రివలస గ్రామంలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కొత్త రక్షణ చట్టాలను వివరించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ద్వారా అవసర మైన వారికి ఉచితంగా న్యాయసహాయం అందిస్తామని చెప్పారు. అనంతరం స్థానికుల సందేహాలను నివృత్తి చేశారు. న్యాయవాదులు రాపాక సాయిసురేష్, సాయిశేఖర్, కె.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోండి

వేపాడ: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సచివాలయ మహిళా పోలీసులకు ఎస్.కోట రూరల్ సీఐ రవికుమార్ సూచించారు. వల్లం పూడి



వేపాడ: మహిళా పోలీసులకు చట్టాలను వివరిస్తున్న రూరల్ సీఐ రవికుమార్

పోలీస్ స్టేషన్ లో మండలంలోని సచివాలయ మహిళా పోలీసులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని, సారా, అక్రమంగా మద్యం విక్రయం, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగితే పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, అలాగే బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు.

మత్తుతో జీవితాలు చిత్తు

గుర్ల: మత్తు పదార్థాలకు బానిసగా మారితే జీవితాలు నాశనమవుతాయని, యువత, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని ఎస్‌ఐ భాస్కరరావు సూచించారు. మండలంలోని కెల్ల గ్రామంలో యువత, వారి తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఇష్టారీతిగా మత్తు పదార్థాలు తీసుకుంటున్నారని, పిల్లల ప్రవర్తనలో వస్తున్న మార్పులను తల్లిదండ్రులు పరిశీలిస్తుండాలని సూచించారు.విద్యార్థులు చెడుస్నేహాలకు దూరంగా ఉండాలని, మొబైల్ ఫోన్‌లతో కాలక్షేపం చేయకుండా శ్రద్ధగా చదువుకోవాలని చెప్పారు. పలుచట్టాల గురించి, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

గాలికుంటు వ్యాధితో పశువులకు తీవ్రనష్టం



మెరకముడిదాం: గర్భాంలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి హైమావతి



చీపురుపల్లి: నిమ్మలవలసలో టీకాలు వేస్తున్న సిబ్బంది



గంట్యాడ: రావివలసలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

చీపురుపల్లి: గాలికుంటు వ్యాధితో పశువులకు తీవ్ర నష్టం కలుగుతుందని పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ ఆర్.శారద చెప్పారు. గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మండలంలో మంగళవారం ఆమె ప్రారంభించారు. అలజంగి, నిమ్మలవలస గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. పశుసంవర్థకశాఖ సహాయకులు, సిబ్బంది కలిసి బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో టీకాలు వేస్తున్నట్లు ఆమె తెలిపారు. పాడిరైతులంతా తమ పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే నీరసించి పోతాయని, ఆవులు, గేదెలు చూడికట్టవని చెప్పారు.

పాలఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంది

మెరకముడిదాం: పాడి పశువులకు గాలికుంటువ్యాధి సోకితే వాటిలో పాల ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందని మెరక ముడిదాం, గర్భాం పశువైద్యశాలల వైద్యాధికారి సీహెచ్.హైమావతి తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటువ్యాధి టీకాల కార్యక్రమాన్ని గర్భాం గ్రామంలో మంగళవారం ఆమె ప్రారంభించారు. గర్భాం, నరసయ్యపేట, చినమంత్రి పేట, పెదమంత్రిపేట, లెంకపేట, బోడందొరవలస గ్రామాల పాడిరైతులకు చెందిన 620 పశువులకు టీకాలు వేశారు.

నరవ, బోనంగిలో..

గంట్యాడ: మండలంలోని నరవ, బోనంగి, రావివలస గ్రామాల్లో పశుసంవర్థకశాఖ సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు మంగళవారం వేశారు. మండలంలో ఈ టీకాల కార్యక్రమం సెప్టెంబర్18వ తేదీ వరకు కొనసాగుతుందని, పాడి రైతులు తమ పశువులకు టీకాలను వేయించాలని పశుసంవర్థక శాఖ సిబ్బంది సూచించారు.

ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు...



శృంగవరపుకోట: ఎమ్మెల్సీ బొత్సను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్.కోట మండల నాయకులు



గుర్ల: బొత్సను కలిసిన గుర్ల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికై న బొత్స సత్యనారాయ ణను విశాఖలోని ఆయన నివాసంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనా రాయణరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,నాయకులు విశాఖ వెళ్లి బొత్సకు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

శృంగవరపుకోట: ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికై న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు మంగళవారం విశాఖపట్నంలోని బొత్స నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అంద జేశారు.

చీపురుపల్లి: ఎమ్మెల్సీగా ఎన్నికై న బొత్స సత్య



చీపురుపల్లి: బొత్సకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న త్రినాథరావు

నారాయణను రామలింగాపురం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన విశాఖపట్నం వెళ్లి బొత్సను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గజపతినగరం రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక ఆధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కిశోర్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్నిశాఖల అధికారుల తో పాటు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

23న దత్తిరాజేరులో..

దత్తిరాజేరు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 23న ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మ ణ్యం మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిం చనున్న ఈ సమావేశానికి ఎంపీటీ సీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఉపాధి పనుల ఎంపికకు 23న గ్రామసభలు


మెరకముడిదాం/దత్తిరాజేరు: ఉపాధి పనుల ఎంపికకు ఈనెల 23వ తేదీన గ్రామసభలు నిర్వహించనున్నట్లు మెరక ముడిదాం,దత్తిరాజేరు మండలాల ఎంపీడీఓలు ఎం.రత్నం, సుబ్రహ్మణ్యం మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపా రు.మెరకముడిదాం,దత్తిరాజేరు మండలాల్లోని అన్ని గ్రామాల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టనున్న ఉపాధి పనులను ఉపాధి సిబ్బంది గ్రామసభల ద్వారా ఎంపిక చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, ఉపాధివేతనదారుల సమక్షంలో ఆయా గ్రామాలకు అవసరమైన పనులను గుర్తించాలని సూచించారు. గ్రామసభపై 22వ తేదీన ప్రజలకు సమాచారం తెలియజేయాలని స్పష్టం చేశారు.

బంగారం చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

చీపురుపల్లిరూరల్(గరివిడి): బంగారం చోరీ చేసిన కేసులో నిందితుడికి రిమాండ్ విధించినట్లు గరివిడి ఎస్‌ఐ ఎల్.దామోదరరావు తెలిపారు. ఇంటిలో దాచుకున్న 9 తులాల బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకుపోయారని ఈ నెల 15న గరివిడి మండలంలోని దేవాడ గ్రామానికి చెందిన ఏనేతల అనూష గరివిడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఎల్.దామోదరరావు కేసు నమోదు చేసి, ఇన్‌చార్జి సీఐ డి.మోహనరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. తాళ్లపూడి దుర్గాప్రసాద్ అనే 20 ఏళ్ల యువకుడిని గరివిడి బ్రిడ్జి డౌన్‌లో పట్టుకుని అరెస్టు చేశారు. ముద్దాయి వద్ద ఉన్న మూడు తులాల పావు హారం, పావు తక్కువ ఆరు తులాల కరిగించిన బంగారం ముక్కలను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

- 22 మందిని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్



పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మెరకముడిదాం: మండలంలోని పెదపూతికవలస గ్రామ శివారులో ఉన్న మామిడితోటలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన ఈ దాడుల్లో భాగంగా పేకాట అడుతున్న 22 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,23,869 నగదు, 24 మొబైల్‌ఫోన్లు, 15 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పేకటరాయుళ్లను బుదరాయవలస పోలీసులకు అప్పగించారు. దీంతో బుదరాయవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు పేకటరాయుళ్లపై కేసులు నమోదు చేశారు.

నేడు భారత్ బంద్

వేపాడ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును వెంటనే రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర, దేశ సంఘాల పిలుపు మేరకు ఏపీ మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం భారత్ బంద్‌కు పిలుపునిచ్చామని మాలమహానాడు మండల శాఖ అధ్యక్షుడు దేబార్కి కిరణ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్గీకరణతో దళితుల మధ్య విభేదాలు సృష్టించడం సరికాదన్నారు. బంద్ విజయవంతానికి అంతా సహకరించాలని కోరారు. మాలమహానాడు



మాట్లాడుతున్న మాలమహానాడు మండల అధ్యక్షుడు కిరణ్

నేతలు రవి,బంగారయ్య, అప్పారావు, వెంకటరావు, సూరిబాబు, గుమ్మాల అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల కట్టడి



బొండపల్లి: గొల్లలపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



శృంగవరపుకోట: దోమల నిర్మూలనకు పని చేస్తామని ఎస్.కోటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, వైద్యసిబ్బంది

బొండపల్లి: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమలను నియంత్రించవచ్చని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్‌లు ఎల్.సత్యనారాయణ, సమీరా అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గొల్లలపేట,వేంద్రాం గ్రామాల్లో విద్యార్థులు, వైద్య సిబ్బందితో కలిసి మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుందని చెప్పారు. నివాస పరిసరాల్లో మురుగు, వర్షం నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. సబ్ యూనిట్ మలేరియా అధికారి గోవింద రాజు లు, హెల్త్‌సూపర్ వైజర్లు ఎస్.ఏ.భాషా,గోపి,ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి, హారిక, ఏఎన్‌ఎం బీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమలతో వ్యాధుల వ్యాప్తి

శృంగవరపుకోట: దోమల వల్ల అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, దోమల అంతమే మన లక్ష్యం కావాలని వైద్యాధికారులు, మండల అధికారులు అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక దేవి కూడలి వద్ద దోమల నివారణ, నిర్మూలన కోసం వైద్యసిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ అరుణకుమారి, కొట్టాం పీహెచ్‌సీ వైద్యులు హారిక, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి..



గజపతినగరం: నల్లబ్యాడ్జీలు ధరించి కోర్టు ఆవరణలో నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు



కొత్తవలస: మంగళపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న యువత

గజపతినగరం: కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిని అత్యాచారం,హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. న్యాయవాదులు మాట్లాడుతూ, అడపిల్లలపై అత్యాచారాలను నిరోధించేందుకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలపై అత్యాచారాలను అరికట్టాలి

కొత్తవలస: దేశంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, వీటిని అరికట్టే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని యువత, విద్యార్థులు కోరారు. కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిపై అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటనను వ్యతిరేకిస్తూ మంగళపాలెం గ్రామంలో యువత, విద్యార్థులు మంగళవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని, ఆడబిడ్డలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

అర్తమూరులో మెగావైద్య శిబిరం



చీపురుపల్లిరూరల్(గరివిడి): మెగా వైద్యశిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది, నిర్వాహకులు



మెరకముడిదాం: గాదెలమర్రివలసలో నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని అర్తమూరులో గ్రామానికి చెందిన విజయగౌరి యువజన స్వచ్ఛంద సేవా సంఘం వారు శ్రీకాకుళం జిల్లా జెమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో మంగళవారం మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో సుమారు 400 మందికి జెమ్స్ వైద్యులు సేవలందించారు. నేత్ర, గుండె, చర్మ సంబంధిత వ్యాధులు, బీపీ, సుగర్ వంటి వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్న పిల్లలకు చికిత్స చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సేవాసంఘం అధ్యక్షుడు పిల్ల సుధాకర్, టీడీపీ నాయకులు ఎం.రమణమూర్తి, సీహెచ్.శ్రీనివాసరావు,గోవిందరావు,స్వామి నా యుడు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం

మెరకముడిదాం: గాదెలమర్రివలస గ్రామంలో మానవీయతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు, గ్రామానికి చెందిన చల్లా శ్రీరామ్ ఆధ్వర్యంలో మంగళవారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ 63 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 24 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ దేవా , గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్ వితరణ



ఉపాధ్యాయులకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎంపీటీసీ భవాని, సర్పంచ్ పాపునాయుడు

గంట్యాడ: మండలంలోని పెదవేమలి ఉన్నత పాఠశాలకు ఆ స్కూల్ పూర్వ విద్యార్థి చప్ప వెంకటేష్ తన కుమార్తె జ్ఞాపకార్థం రూ.30 వేల విలువ చేసే యాసర్ ల్యాప్ ట్యాప్‌ను వితరణ చేశారు.ల్యాప్ టాప్‌ను హెచ్‌ఎం ఆదిలక్ష్మికి ఎంపీటీసీ పాటుపు రెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా ఎంపీటీసీ, సర్పంచ్ మాట్లా డుతూ ప్రభుత్వం,దాతలు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. లక్ష్యాన్ని నిర్ధేశించుకుని దాన్ని సాధించడానికి కృషి చేయాలని చెప్పారు. ఉపసర్పంచ్ చప్ప నారాంనాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు రాఘవ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ జయంతి



డిగ్రీ కళాశాలలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు



సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో రాజీవ్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు నేతృత్వంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ జి.ఈరన్న మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ సాంకేతిక విప్లవ నిర్మాత అని, అనేక ప్రాజెక్టుల ద్వారా దేశాన్ని అభివృద్ధి చేసి ప్రపంచం దృష్టిని ఆకర్షించారన్నారు. దేశమంతటా ఉన్నత విద్యాకార్యాక్రమాలను ఆధునీకీకరించటానికి, విస్తరించడానికి, జవహర్ నవోదయ విద్యాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. వైస్ ప్రిన్సిపా ల్ కె.వాసుదేవరావు, అధ్యాపకులు డాక్టర్ సుధీర్, షేక్ వలీఖాన్, అప్పలరాజు, డి.హైమావతి, డి.రామకృష్ణ, డి.లక్ష్మణ్, శివకుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతృత్వంలో....

పట్టణంలోని సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం నిర్వహించారు.రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గేదెల తిరుపతిరావు, నాయకులు హెచ్.నానాజీ, సీహెచ్.ఈశ్వరరావు, మట్టా వీరభద్రరావు, సీతంనాయుడు, వి.గోపి, తదితరులు పాల్గొన్నారు.